క్లుప్తంగా

మంత్రి పొంగులేటిని కలిసిన హనుమంతరావు



మంత్రిని సన్మానిస్తున్న హనుమంతరావు

నేలకొండపల్లి: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నూక హనుమంతరావు బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పలు విషయాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు నామినేటెడ్ పోస్టుల్లో టీడీపీకి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అభివృద్ధికి సంబంధించిన విషయాలను మండలంలోని బైరవునిపల్లికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కోరినట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం/కూసుమంచి: ఖమ్మం నగరంలోని రామాలయం ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-2 ఏఈ ఆపరేషన్స్ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో రామాలయం సెంటర్, బైపాస్ రోడ్, పాత డీఆర్‌డీఏ, రవీంద్రనాథ్ ఠాగూర్ రోడ్(బురహాన్‌పురం) తదితర ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా కూసుమంచి మండలం పాలేరు ఫీడరు పరిధిలోని 11 కేవీ వ్యవసాయ విద్యుత్ లైన్‌ల మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ వెంకన్న నాయక్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏఈలు కోరారు.

నేడు సాయి మందిరంలో అన్నదానం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ మధురానగర్‌లోని సాయిబాబా మందిరంలో మొదటి గురువారం సందర్భంగా మధ్యాహ్నం 12.30 గంటలకు బాబా వారి మధ్యాహ్న హారతి అనంతరం అన్న ప్రసాద వితరణ ఉంటుందని బాబామందిర కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. బాబా మందిరంలో ప్రతీ నెల మొదటి, మూడవ గురువారాల్లో అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి..

కామేపల్లి: క్రీడలు మానసికోల్లాసాన్ని, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పొన్నేకల్ గ్రామంలో బోడేపూడి ట్రస్ట్ ఆధ్వర్యాన నిర్వహించిన కామేపల్లి, కారేపల్లి, గార్ల, డోర్నకల్ మండలాల క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. యువతను ప్రోత్సహించేందుకు ట్రస్ట్ నిర్వాహకుడు రాజా ముందుకురావడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ గుజ్జర్లపూడి రాంబాబు, నల్లమోతు లక్ష్మయ్య, ఏపూరి మహేందర్, సత్యనారాయణ, నరసింహానాయక్, వల్లభనేని అశోక్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఓం బీమ్ బుష్
వినోద	(టిల్లు)2
సాయిరాం	గాడ్జిల్లా కింగ్
ఆదిత్య	రజాకార్
శ్రీనివాస	(టిల్లు)2
సుందర్	ది గోట్ లైఫ్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	28	బచ్చలికూర	5
వంకాయ	20		20
బెండకాయ	20	పాలకూర	2
పచ్చిమిర్చి	30		10
కాకర	46	చుక్కకూర	2
బీర	46		10
దొండ	20	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	100	గోంగూర	2
గోరుచిక్కుడు	36		10
క్యాబేజీ	24	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	20		20
ఆలుగడ్డ	34	కొత్తిమీర	1
చామగడ్డ	50		30
క్యారెట్	36	పుదీన	1
క్యాప్సికం	70		20

-ఖమ్మం వ్యవసాయం

హై'మస్త్' వెలుగులు..!



నేలకొండపల్లిలో డివైడర్ మధ్యలో వేసిన విద్యుత్ స్తంభాలు

కొత్త శోభ సంతరించుకోనున్న మండల కేంద్రం

- నేలకొండపల్లి నుంచి చెరువుమాధారం క్రాస్ రోడ్డు వరకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు
- శరవేగంగా సాగుతున్న నిర్మాణ పనులు
- 4 కిలో మీటర్లు.. 134 స్తంభాలతో...
- రూ.1.20 కోట్ల నిధులు మంజూరు

నేలకొండపల్లి: నేలకొండపల్లిలో విద్యుత్ వెలుగుల పనులు ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలో డివైండర్ నిర్మించి ఏళ్లు గడుస్తున్నా.. పనులు నత్తనడక సాగాయి. ఇటీవల రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మండల పర్యటన సందర్భంగా విచ్చేసినప్పుడు మండల, స్థానిక కాంగ్రెస్ నాయకులు సమస్యను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో చర్చించి పనులు జాప్యం చేయొద్దని ఆదేశించారు.

శరవేగంగా పనులు..

మంత్రి ఆదేశాల మేరకు గత నాలుగు రోజుల నుంచి డివైడర్‌లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయి. అతి కొద్ది రోజుల్లోనే నేలకొండపల్లి నుంచి చెరువుమాధారం క్రాస్ రోడ్డు వరకు రహదారి ఇరువైపులా విద్యుత్ వెలుగులు కనిపించనున్నాయి. పట్టణానికి తీసిపోని విధంగా మండల కేంద్రంలో వెలుగులు రానున్నాయి. ఏళ్ల తరబడి పనులు పెండింగ్‌లో ఉన్న వాటిని తిరిగి యుద్ధ ప్రాతిపదికన చేపట్టేందుకు చొరవ తీసుకున్న మంత్రికి స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

నేలకొండపల్లి టూ.. చెరువుమాధారం క్రాస్ రోడ్డు..



స్తంభాల ఏర్పాటుకు సాగుతున్న పనులు

నేలకొండపల్లి మండల కేంద్రం నుంచి చెరువుమాధారం క్రాస్‌రోడ్డు వరకు డివైండర్‌కు ఇరువైపులా విద్యుత్ వెలుగులను ఏర్పాటు చేయనున్నారు. నాలుగు కిలో మీటర్లు.. 134 పోల్స్‌కు ఇరువైపులా లైట్లు.. రింగ్‌రోడ్డులో హైమాస్ట్ వెలుగులు రానున్నాయి. ఇందు కోసం ఆర్‌అండ్‌బీ (విద్యుత్ అధికారులు) మార్కింగ్ చేయగా.. పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. కాగా, ఈ నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.1.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. నేలకొండపల్లి నుంచి కొత్తకొత్తూరు, తిరుమలాపురం, చెరువుమాదారం క్రాస్‌రోడ్డు వరకు మొత్తం 134 విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేయనుండగా.. ప్రతీ స్తంభానికి 25 మీటర్ల దూరం ఉండనుంది. 9 మీటర్ల ఎత్తు కలిగిన పోల్స్‌కు రెండు లైట్లు, 10 మీటర్ల పోల్స్‌కు నాలుగు విద్యుత్ ఫ్లడ్స్ లైట్లు, మండల కేంద్రంలోని రింగ్ రోడ్డు వద్ద 12 మీటర్ల పోల్‌ను ఏర్పాటు చేసి 6 హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయనున్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ) శ్రీనివాస్, వరంగల్ డీఈఈ సబియా సుల్తానా, ఏఈ రాజేష్ లు పనులను పరిశీలించారు.

సంత నిర్వహణను పరిశీలించిన అధికారులు



సంతను పర్యవేక్షిస్తున్న డీపీఓ హరికిషన్

కామేపల్లి: మండలంలోని కొమ్మినేపల్లి(పండితాపురం) గ్రామ పంచాయతీ పరిధిలో శ్రీ కృష్ణప్రసాద్ వారంతపు సంత నిర్వహణను డీపీఓ హరికిషన్, డీఎల్‌పీఓ కీర్తిప్రభాకర్ పర్యవేక్షించారు. బుధవారం సంత నిర్వహణను జీపీకి అప్పగించడంతో గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ రవీందర్ ఆధ్వర్యాన నిర్వహించగా.. సంత నిర్వాహణను జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. రైతులకు, వ్యాపారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, కొనుగోళ్లు, అమ్మకందారుల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన రుసుం ప్రకారం వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు.కాగా, ఇప్పటివరకు సుమారు రూ.5లక్షల వరకు వసూళ్లు అయినట్లు తెలిసింది. ఈ విషయమై ఎంపీడీఓను వివరణ కోరగా.. పూర్తిస్థాయి వసూళ్ల లెక్కింపు అయ్యాక వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి గుగులోత్ నెహ్రూ నాయక్,కార్యదర్శులు,జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దేవాలయ పాలకవర్గం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్‌లో స్వయంభూ శ్రీఅభయ వేంకటేశ్వరస్వామి దేవస్థానం 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 9 నుంచి ప్రారంభమవుతున్నాయని దేవాలయ పాలకవర్గం వెల్లడించారు. బుధవారం ఈ మేరకు దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు బొల్లి కొమరయ్య, కార్యదర్శి పురం తిరుపయ్య, కోశాధికారి బానోత్ మల్సూర్, ప్రధాన అర్చకులు నరగిరినాధుని రామాచార్యులు, కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి, అల్లిక అంజయ్య, భక్తమండలి సభ్యులు పాల్గొన్నారు. ఈ బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని వారు కోరారు.

'నలంద' విద్యార్థి ప్రతిభ




విద్యార్థిని అభినందిస్తున్న నలంద కరస్పాండెంట్

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన 5కే రన్‌లో తమ విద్యార్థి ప్రతిభ కనబర్చినట్లు నలంద పాఠశాల కరస్పాండెంట్ కె.సూరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 9వ తరగతి విద్యార్థి కొయ్యడ మస్తాన్ 5కే రన్‌లో ప్రతిభ కనబర్చి ప్రథమ బహుమతిని కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉషమాధురి తదితరులు పాల్గొన్నారు.

గిరిజ అంత్యక్రియలు పూర్తి

ఖమ్మంక్రైం: వరకట్న వేధింపులతో తీవ్ర మనస్థాపానికి గురై నగరంలో మంగళవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడిన గుమ్మడెల్లి గిరిజచంద్రలక్ష్మి(22) అంత్యక్రియలను బంధువుల అశ్రునయనాల మధ్య బుధవారం నిర్వహించారు. మహబూబాబాద్‌కు చెందిన తన మేనమామ కుమారుడైన శరత్‌చంద్రతో నగరంలోని గాంధీనగర్‌కు చెందిన గిరిజకు వివాహమైంది. అయితే పెళ్లయిన దగ్గర నుంచి ఆమె భర్త, అత్త, ఆడపడుచులు అదనపు వరకట్నం తేవాలని వేధింపులకు గురి చేస్తున్నారు. మంగళవారం కూడా భర్త, ఆడపడుచులు వేధించడంతో గిరిజ తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు వరకట్నవేధింపుల కింద పోలీసులు కేసు నమోదు చేయగా.. సంఘటనా స్థలాన్ని నగర ఏసీపీ రమణమూర్తి, సీఐ బాలకృష్ణ సందర్శించి పరిశీలించారు. గిరిజకు సంవత్సరం కుమారుడు ఉన్నాడు. పోలీసులు గిరిజ భర్త శరత్ చంద్ర, అతడి తల్లిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది

సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం తగదు



వివరాలు వెల్లడిస్తున్న స్థానికులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని కవిరాజ్‌నగర్‌నగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలను నిర్వహిస్తున్నా.. అధికారులు పట్టించుకోవటం లేదని, దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని స్థానికులు ఎం.రామచందర్, టి.ఉపేందర్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పాఠశాలను సుమారు 133 గజాల్లో ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారని, కనీస సౌకర్యాలు లేవని, టాయిలెట్లు దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై పలుమార్లు అధికారులకు విన్నవించినా విచారణ చేసి పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో టి.సాంబశివరావు, రవికుమార్‌లు పాల్గొన్నారు. దీనిపై డీఈఓ సోమశేఖరశర్మను వివరణ కోరగా.. గతంలో అందిన ఫిర్యాదుపై స్థానిక ఎంఈఓతో విచారణ జరిపించామని, అవసరమైన పక్షంలో తాను సైతం వెళ్లి పాఠశాలను సందర్శిస్తానని, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు.

నియామకం

తిరుమలాయపాలెం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యాన సత్తుపల్లి నియోజకవర్గ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్‌ను నియమితులైనట్లు బుధవారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. కాంగ్రెస్ పార్టీ విధేయుడిగా ఉంటూ పార్టీ కార్యక్రమాలలో చురుకైన పాత్ర పోషించినందుకు ఆయన ఎన్నిక కాగా నియామకం పట్ల పార్టీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థికి గాయాలు

నేలకొండపల్లి: పాఠశాలలో ఆటలు ఆడుతుండగా ప్రమాదవశాత్తు విద్యార్థికి గాయాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సందీప్ బుధవారం పాఠశాలలో ఆట ఆడుతున్నారు. ప్రమాదవశాత్తు పడిపోవటంతో చేయ్యికి గాయమైంది. స్థానిక ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.


మజ్జిగ, పులిహోర ప్యాకెట్ల పంపిణీ..



పులిహోర ప్యాకెట్లు అందిస్తున్న దృశ్యం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ప్రముఖ వ్యాపారి తేరాల రంగయ్య 9వ వర్ధంతి సందర్భంగా బుధవారం రైతులకు, కార్మికులకు, వ్యాపారులకు, మార్కెట్ సిబ్బందికి మజ్జిగ, పులిహోర ప్యాకెట్లను పంపిణీ చేశారు. రంగయ్య తనయుడు, దాల్ మిల్ వ్యాపారుల అసోసియేషన్ ప్రతినిధి తేరాల ప్రవీణ్ ఆధ్వర్యాన 500 మజ్జిగ ప్యాకెట్లు, 500 పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాపార ప్రతినిధులు కల్వకుంట్ల గోపాల్‌రావు, తేరాల భాస్కర్ రావు, తేరాల రమణ, తేరాల సంతోష్, సందీప్, కొత్త రాజు, గ్రంథె సురేష్, మోటమర్రి శివ, పుల్లఖండం వంశీ పాల్గొన్నారు.

'ఎస్‌బీఐటీ'లో సైబర్ జాగృక్త దివస్



మాట్లాడుతున్న సైబర్ క్రైం సీఐ ఫణీంద్ర

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో సైబర్ జాగృక్త దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైం ఏసీపీ సీహెచ్ ఆర్‌వీ ఫణీంద్ర మాట్లాడుతూ.. పెట్టుబడి మోసాలు, హోటల్ రేటింగ్ మోసాలు, లోన్ యాప్ మోసాలు, సైబర్ మోసాలు, సైబర్ నేరాలకు వ్యతిరేకంగా ఇంటర్నెట్ వినియోగంపై అవగాహన కల్పించేందుకు సైబర్ జాగృక్త దివస్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సైబర్ బెదిరింపుల నుంచి రక్షించుకునేందుకు కావాల్సిన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైం ఎస్ఐ విజయ్‌కుమార్, కళాశాల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగుమట్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పడిగ యర్రయ్య

ఖమ్మం మామిళ్లగూడెం: వెలుగుమట్లలోని వినోబా సవోదయ కాలనీ పేద ప్రజల ఇళ్లకు కరెంటుతో పాటు నీటి కుళాయిలు లేక సమస్యలతో సతమతమవుతున్నారని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పడిగ యర్రయ్య తెలిపారు. బుధవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కరెంటు, నీళ్ల లేక వృద్ధులు వికలాంగులు కుటుంబాలతో బాధపడుతున్నారని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమస్యలపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని, పేదలకు ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి తమ సమస్యలను ప్రభుత్వం గాలికొదిలేసిందని విమర్శించారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఇళ్లస్థలాల కమిటీ అధ్యక్షుడు కామ్రేడ్ జంగం రాంచందర్, సభ్యులు కుంజ కృష్ణయ్య, కొట్టిబాసు, నారాటి చంద్రమోహన్, షేక్ అనీఫా, గడ్డి వెంకటనర్సమ్మ, ఆవుల శిరీష, కల్తీ పద్మ, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి



బీరోలులో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ

తిరుమలాయపాలెం: రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని ధాన్యం నాణ్యత ప్రమాణాలు పాటించాలని కూసుమంచి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.విజయ్‌చంద్ర, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.సీతారాంరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని బీరోలు, ఏలువారిగూడెం గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించిన సందర్భంగా వారు మాట్లాడారు. ఈ మేరకు వరి ధాన్యం అమ్ముకునే విధానంలో నాణ్యత ప్రమాణాలు ఎలా పాటించాలో రైతులకు వివరించారు. అదేవిధంగా వచ్చే వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులు చేయాల్సిన ముందస్తు చర్యలు గురించి వివరించారు. రైతులు విత్తనాల ఎంపికలో సంబంధిత అధికారులను సంప్రదించాలని, ముందస్తుగా పచ్చిరొట్ట ఎరువును వాడాలని సూచించారు. రైతు వేదికల్లో జరుగుతున్న వీడియో కాన్ఫరెన్స్‌లల్లో శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ లంక రమేష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



కూసుమంచిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఓ వాణి

కూసుమంచి: మండలంలో యాసంగి ధాన్యం కొనుగోళ్ల నిమిత్తం 8 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, అట్టి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రామడుగు వాణి కోరారు. బుధవారం మండలంలోని నర్సింహులగూడెం, కొత్తూరు, పాలేరు, జక్కేపల్లి, జుజుల్‌రావుపేట, జీళ్లచెరువు, చేగొమ్మ, కూసుమంచి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులు కేంద్రాలకు 17 శాతంలోపు తేమ ఉన్న ధాన్యాన్ని తీసుకురావాలని, దళారులకు ధాన్యం విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధరను పొందాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

మహిళ మృతి

నేలకొండపల్లి: ఇంటి వద్ద పని చేసుకుంటున్న ఓ మహిళ ఒక్కసారిగా కుప్పకూలి అక్కడికక్కడికే మృతి చెందిన సంఘటన మండలకేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నేలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన సుజాత (57) బుధవారం ఇంటి వద్ద పని చేసుకుంటుంది. ఈక్రమంలో ఒక్కసారిగా ఆమె కుప్పకూలిపోవడంతో కుటుంబసభ్యులు గమనించి నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

గుండెపోటుతో రేషన్ డీలర్..

కామేపల్లి: మండలంలోని గోవింద్రాల గ్రామానికి చెందిన రేషన్ షాపు డీలర్ లకావత్ కిషన్(40) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బానోత్ వెంకన్న, నరసింహానాయక్, పీఏసీఎస్ చైర్మన్ గుజ్జర్లపూడి రాంబాబు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, లకావత్ సునీత తదితరులు కిషన్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సందడిగా పాఠశాల వార్షికోత్సవం

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని సింగారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆట,పాటలతో సందడి చేశారు. హెచ్‌ఎం హరి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమీ మానిటరింగ్ అధికారి కె.రవికుమార్ పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తుందని, కార్పొరేట్‌స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలో విద్యా బోధన జరుగుతుందని అన్నారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రులు చేర్పించి వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ ఏడీ బోడేపూడి శ్రీనివాసరావు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం జి.రమేష్, చైర్మన్ బత్తుల నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రైతుల కుటుంబాలకు అండగా ఉంటాం..



చెక్కు అందిస్తున్న చైర్మన్ రాంబాబు

కామేపల్లి: పీఏసీఎస్ పరిధిలోని రైతులతో పాటు వారి కుటుంబాలకు అండగా ఉంటామని కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్ గుజ్జర్లపూడి రాంబాబు అన్నారు. సంఘ పరిధిలోని ఇద్దరు సభ్యులు గోవింద్రాల గ్రామానికి చెందిన లకావత్ రాజు అనే రైతు మృతి చెందగా.. ప్రధానమంత్రి జీవన జ్యోతి పథకం కింద మంజూరైన రూ.2 లక్షల చెక్కును మృతుడి భార్య శాంతికి, పొన్నేకల్ గ్రామానికి చెందిన బానోత్ శౌరి అనే మహిళా రైతు మృతి చెందగా.. గ్రూప్ ఇన్సూరెన్స్ కింద మంజూరైన రూ.50 వేల చెక్కును భర్త దూపాకు అందజేశారు. సంఘ అభివృద్ధికి రైతులు సహకరించాలని, సకాలంలో రైతులు చెల్లించాల్సిన రుణ బకాయిలను చెల్లించాలన్నారు. కామేపల్లి డీసీసీబీ మేనేజర్ శ్రీవాణి, సీఈఓ గాదె నాగయ్య, రైతులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంక్షేమానికి కృషి

ఖమ్మం మామిళ్లగూడెం: వయోవృద్ధుల సంక్షేమం కోసం కృషి చేయాలని సీనియర్ సిటిజన్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ అన్నారు. బుధవారం ఖమ్మం గాంధీ పార్కులోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘంలోని సభ్యులకుసంఘం ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యాన సంఘ సభ్యుడు కె.ఉపేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేట్ అధ్యక్షుడు ఆర్.రవీందర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి సాధినేని జనార్దన్‌రావు, జి.నాగేశ్వరరావు, శ్రీహరి, గోవర్దన్, డి.శ్రీనివాసరావు, కె.సత్యనారాయణరెడ్డి, లక్ష్మీనారాయణ, పుల్లారావు, జెల్లా వెంకటేశ్వర్లు, అనాశి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శేషగిరిరావు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(1104) జిల్లా కంపెనీ కార్యదర్శి తక్కెళ్లపల్లి శేషగిరిరావు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని వైరారోడ్‌లో ఉన్న విద్యుత్ కార్మిక భవనంలో ఆయన మాట్లాడారు. సంస్థలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని కోరారు. కార్మికులకు ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ వర్తింపజేయాలని, విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఖాళీగా ఉన్న పోస్టులను కాంట్రాక్ట్ సిబ్బందితో భర్తీ చేయాలని, అన్‌మ్యాన్డ్ కార్మికులను ఆర్టిజన్లుగా క్రమబద్ధీకరించాలని సంస్థ యాజమాన్యాన్ని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కొత్తగూడెం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.మోహన్‌రావు, హేమంత్, ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జీఎల్‌ఎన్ రావు, నాయకులు జీవీఎస్‌ఎస్ శ్రీనివాసరావు, వెంకట్రావు, కోటేశ్వరరావు, కిరీటీ చారి, సీతారామయ్య, అశోక్, మాధవి, మంజుల, భవాని, కనకదుర్గ, గీత తదితరులు పాల్గొన్నారు.